# బయోమెట్రిక్ కథలొద్దు

- **పౌరసరఫరాల శాఖపై ముఖ్యమంత్రి మండిపాటు**
- **వైద్య ఆరోగ్య శాఖ తీరుపైనా అసంతృప్తి**
- **ఆర్నెల్లలో సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలి**
- **వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు**

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్‌ను రాబోయే ఆరు నెలల్లో సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా అధికార యంత్రాంగం ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వ్యవహరించడంతోపాటు సత్వరం సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే వివిధ సమస్యల్ని వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా వర్గీకరించుకొని ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. బుధవారం రాత్రి సచివాలయంలో ప్రభుత్వ కార్యదర్శులు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు, మంత్రులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశం నాలుగు గంటలపాటు సాగింది. పౌరసరఫరాల శాఖ పనితీరుపై ప్రజల్లో అసంతృప్త స్థాయి ఎక్కువగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 37శాతంగానే ఆ అసంతృప్తి కనిపించినా ఆ ప్రభావం ప్రజల్లో ఎక్కువ కనిపిస్తోందన్నారు. బయోమెట్రిక్ యంత్రాల సమస్య ఉందని ఆ శాఖ అధికారులు చెప్పగా "ఏ శాఖలోనూ లేనిది మీ దగ్గరే ఎందుకు వస్తోందీ! పింఛన్లు కూడా అదే విధంగా ఇస్తున్నాం... వాళ్లకు సమస్యలు రాలేదు కదా! బయోమెట్రిక్ కథలు వద్దు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. డీలర్లు సక్రమంగా దుకాణాలు తెరిచి బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యఆరోగ్య శాఖపై అసంతృప్తి వ్యక్తపరిచారు. ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా సమస్యలు పెరుగుతూనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. కొందరు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక నుంచి ఎంపీడీవో, తహసీల్దార్లను కూడా ఈ కాన్ఫరెన్స్‌లకు తీసుకోవాలని ఆదేశించారు.

## స్వచ్ఛతపై 15 రోజులకోసారి సమీక్ష

ఇకపై స్వచ్ఛత, ప్రజా సమస్యల పరిష్కారం అంశాలపై 15 రోజులకోసారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని సీఎం స్పష్టం

(మిగతా 2లో)



స్వచ్ఛాంధ్ర మిషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సచివాలయ ఆవరణలో వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు